# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 9, జనవరి 2026


## సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**✤ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి**



**ఆసిఫాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** సదరం శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న దివ్యాంగుల నిర్ధారణ సదరం శిబిరాన్ని ఆకస్మికంగా సందర్శించి శిబిరం నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సదరం శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, సదరం ధ్రువీకరణ పత్రాల జారీలో పారదర్శకంగా వ్యవహరించాలని, అర్హత కలిగిన దివ్యాంగులకు ధ్రువపత్రాలను అందించాలని తెలిపారు. సదరం శిబిరానికి వచ్చే దివ్యాంగులు, వారి సహాయకులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని, మీ సేవా కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకున్న వారికి ఆలస్యం కాకుండా నిర్ణీత సమయంలోనే పరీక్షలు పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు. వివిధ అనారోగ్య సమస్యలపై ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రిలో అవసరమైన మందుల నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి, ఆసుపత్రి ఆర్ఎంఓ, ఎస్ఓ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా భీమదేవర జెండా పండుగ

**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, జనవరి 8, ప్రభాతవార్త**

పలు గ్రామాల్లో గురువారం భీమన్న దేవర జెండా పండుగను ఆదివాసీలు సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ గ్రామాన ప్రత్యేక పూజలు జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టారు. ఆదివాసి కోలావర్, మన్నెవార్ ఆరాధ్య దైవమైన భీమన్న దేవరకు పూజలు నిర్వహించి, గ్రామాల సంక్షేమం, పంటలు సమృద్ధిగా పండాలని దేవరను ప్రార్థించారు.






లోపలి పేజీల్లో..


## ఎంసీసీ కార్మికులకు నష్ట పరిహారం చెల్లించాలి

**✦ రఘునాథ్ వెరబెల్లి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు**

**మంచిర్యాల, జనవరి 8, ప్రభాతవార్త**

ఎంసీసీ సిమెంట్ కంపెనీ మూత పడటంతో కంపెనీలో పని చేస్తున్న 53 మంది కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎంసీసీ కంపెనీ ఎదుట కార్మికులు చేస్తున్న దీక్షకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి మద్దతు తెలిపి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ కంపెనీ యాజమాన్యం తక్షణమే స్పందించి ప్రతి కార్మికునికి 50 లక్షల రూపాయల నష్ట పరిహారం మరియు రెండు గుంటల భూమి అందించి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాకాని రఘునాథ్ డిమాండ్ చేశారు. గత 30 సంవత్సరాలుగా కార్మికులు ఈ కంపెనీ పై ఆధారపడి కుటుంబాలు ఉన్నాయని కంపెనీ మూత పడటంతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని,కంపెనీ యాజమాన్యం తక్షణమే స్పందించి కార్మికులను ఆదుకోవాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్ రావు, సతీష్ రావు, అరేందుల శ్రీనివాస్, శివ కృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.




## ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**✪ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, జనవరి 8, ప్రభాతవార్త**

10వ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా సైన్స్ కేంద్రంలో జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్యతో కలిసి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో 10వ తరగతి వార్షిక పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2026 మార్చ్ నెలలో 10వ తరగతి వార్షిక పరీక్షకు సిద్ధమవుతున్న ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ వహించి, 100 శాతం ఉత్తీర్ణతతో పాటు ఉత్తమ ఫలితాల సాధన దిశగా ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని, 100 శాతం ఫలితాల సాధనకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకోవాలని, విద్యార్థుల తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ విద్యార్థులలో పురోగతికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆధునిక యాంత్రికరణ ద్వారా అన్ని రంగాలలో పని సులభతరం అవుతుందని, ఈ క్రమంలో విద్యార్థులు ఏకాగ్రతతో విద్య అభ్యసించి అన్ని రంగాలలో రాణించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ప్రతి సబ్జెక్టుపై విద్యార్థులకు మిగతా 2లో..




## విద్యార్థుల్లో ఆంగ్ల నైపుణ్యాలను పెంపొందించాలి

**☆ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్, జనవరి 08, ప్రభాతవార్త:** నార్నూర్ ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంగ్లీష్ ఫౌండేషన్ అభ్యాసన నైపుణ్యాలు, తదితర అంశాలపై విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆంగ్ల భాషపై పట్టు సాధించడం ఎంతో అవసరమని తెలిపారు. దీనికోసం ప్రవేశపెట్టిన ఇంగ్లీష్ ఫౌండేషన్ అభ్యాస కార్యక్రమాన్ని పాఠశాలల్లో పకడ్బందీగా మిగతా 2లో..



## విద్యార్థుల్లో ఆంగ్ల నైపుణ్యాలను పెంపొందించాలి

(మొదటిపేజీ తరువాయి)

అమలు చేయాలని సూచించారు. ఒకటి నుంచి ఐదవ తరగతి విద్యార్థులకు ప్రణాళికలతో బోధన చేపట్టి, ఆంగ్లం సబ్జెక్టు పై పరీక్షలు నిర్వహించి నైపుణ్యాల నివేదికను సమర్పించాలని ఆదేశించారు. నార్నూర్ బ్లాక్ పరిధిలోని పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ కింద నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, కోఆర్డినేటర్ అజయ్, వివిధ మండలాల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా భీమన్న దేవర జెండా పండుగ

**తాండూర్, జనవరి 8, ప్రభాతవార్త**

మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం 24వ భీమదేవర జెండా పండుగ ను ఆదివాసీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి సంఘాల నాయకులు, ప్రజలు జెండా ఎగురవేశారు.

**పెంచికల్‌పేట్, జనవరి 8, ప్రభాతవార్త :**

పెంచికల్‌పేట్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం భీమన్న దేవర జెండా పండుగను ఆదివాసీలు సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ గ్రామాన ప్రత్యేక పూజలు జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టారు. ఆదివాసి కోలావర్, మన్నెవార్ ఆరాధ్య దైవమైన భీమన్న దేవరకు పూజలు నిర్వహించి, గ్రామాల సంక్షేమం, పంటలు సమృద్ధిగా పండాలని దేవరను ప్రార్థించారు. అనంతరం ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ గిరిజన సంప్రదాయాలు, ఆచారాలు తరతరాలకు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆదివాసీ సంస్కృతి సమాజానికి గొప్ప వారసత్వమని తెలిపారు. పండుగ సందర్భంగా గిరిజన గూడల్లో సంప్రదాయాలు, డప్పు చప్పుళ్లతో ఉత్సవ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఆదివాసీ ప్రజలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికై గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశం

**లింగాపూర్, జనవరి 8, ప్రభాతవార్త :**

లింగాపూర్ మండలంలోని లింగాపూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలపై పాలకవర్గ సభ్యులందరూ కలిసి చర్చించడం జరిగింది, ఈ సమావేశంలో లింగాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ రాజశేఖర మాట్లాడుతూ, గ్రామపంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయుటకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పనిచేయాలని తెలిపారు, ఎండాకాలం దగ్గర పడుతున్నందున నీటి వసతులు కల్పించుటకు ముందు జాగ్రత్తగా విశ్లేషణ చేశారు, ప్రతి వాడకు మంచినీరు అందించాలని తెలిపారు. గ్రామపంచాయతీలో మురికి కాలువలు శుభ్రంగా ఉంచాలని గ్రామాన్ని మండలంలోనే ప్రథమ స్థానంలో ఉండే విధంగా ఐక్యమత్యంతో కలిసికట్టుగా పనిచేద్దామని వివరించడం జరిగింది. ప్రభుత్వము అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హత కలిగిన కుటుంబలకు అందించే బాధ్యత మన అందరిపై ఉంది అని తెలపడం జరిగింది. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ నైతం శత్రుశా. పంచాయతీ సెక్రెటరీ రజనీకాంత్ రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల మున్సిపాలిటీలో ఆశా కార్యకర్తల నియామకానికి విజ్ఞప్తి

**- వైద్యారోగ్య శాఖాధికారికి వినతిపత్రం అందజేసిన ఆమ్ ఆద్మీ పార్టీ**

**నస్పూర్, జనవరి 8, ప్రభాతవార్త**



మంచిర్యాల పాత మున్సిపాలిటీ పరిధిలో ఆశా కార్యకర్తలు అందుబాటులో లేకపోవడం వల్ల గర్భిణులు, బాలింతలు వైద్య సేవల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నయీం పాషా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని, ఈ ప్రాంతంలో వెంటనే ఆశా కార్యకర్తలను నియమించాలని కోరుతూ గురువారం ఆయన జిల్లా వైద్యారోగ్య శాఖాధికారికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, ఆరు మున్సిపాలిటీల్లో ఆశా కార్యకర్తలు నిరంతరం సేవలందిస్తున్నప్పటికీ, కేవలం పాత మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో వారి కొరత వేధిస్తోందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆశా కార్యకర్తలు లేకపోవడంతో ప్రభుత్వ వైద్య పథకాలు, టీకాలు, ప్రసూతి సాయం వంటి కీలక సేవలు సామాన్యులకు సకాలంలో అందడం లేదని వివరించారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ప్రత్యేక చొరవతో ఇక్కడ నియామక ప్రక్రియను చేపట్టాలని నయీం పాషా విజ్ఞప్తి చేశారు.

# వార్త దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ



విడుదల చేస్తున్న ఐటీడీ ఏ పి ఓ యువరాజ్ మర్మాట్



వార్త క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రహీముద్దీన్

**ఉట్నూర్, జనవరి 8, ప్రభాతవార్త :**

ఐటీడీ ఏ కార్యాలయం లో ఐటీడీ ఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్ చేతుల మీదుగా గురువారం వార్త దినపత్రిక క్యాలెండర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ పత్రిక విలేకరి అంటే ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ వేతికి తీసి ప్రపంచానికి తెలియ పరుస్తున్నారు. ఈ విడుదల కార్యక్రమం లో ఉట్నూర్ విలేకరి జాదవ్ వసంత్ రావు, బానోత్ రవీందర్‌లు ఉన్నారు.

**సిర్పూర్ (టి), జనవరి 8, ప్రభాతవార్త:**

సిర్పూర్ మండల కేంద్రంలో గురువారం రోజున తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ రహీముద్దీన్ వార్త దినపత్రిక 2026 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ వార్త దినపత్రిక ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా పనిచేస్తుందని ఆయన అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ బక్కయ్య ఆర్ఐ నవ తెలంగాణ రిపోర్టర్ ధనుంజయ్, జూనియర్ అసిస్టెంట్లు ఇమ్రాన్. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## సీఎంపిఎఫ్ సేవల వేగవంతానికి చర్యలు

**- జాప్యం లేకుండా ఉద్యోగులకు లబ్ధి అందించడమే లక్ష్యం**

**- సీ.ఎం.పి.ఎఫ్ రీజినల్ కమిషనర్-2 డా. కే. గోవర్ధన్**

**మందమర్రి, జనవరి 8, ప్రభాతవార్త**

జాప్యం లేకుండా సీఎంపిఎఫ్ సేవలను ఉద్యోగులకు త్వరగా అందించేందుకు కృషి చేస్తున్నామని సీ.ఎం.పి.ఎఫ్ రీజినల్ కమిషనర్-2 డాక్టర్ కే. గోవర్ధన్ తెలిపారు. మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన తెలిపారు. సికేర్స్ పోర్టల్ ద్వారానే అన్ని లావాదేవీలు సీఎంపిఎఫ్, పెన్షన్‌లకు సంబంధించిన అన్ని లావాదేవీలు ప్రస్తుతం సికేర్స్ పోర్టల్ ద్వారానే జరుగుతున్నాయని ఆయన తెలిపారు. కొత్తగా సీఎంపిఎఫ్ పెన్షన్ క్లెయిమ్స్‌ను వేగంగా పరిష్కరించేందుకు 'ప్రయాస్' అనే విధానాన్ని అమలులోకి తీసుకువచ్చామని చెప్పారు. జీరో పెండింగ్ దిశగా చర్యలుబొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు సీఎంపిఎఫ్ పెన్షన్‌కు సంబంధించిన క్లెయిమ్స్‌ను జీరో పెండింగ్ దిశగా పరిష్కరిస్తున్నామని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా సేవలు పొందవచ్చని డా. గోవర్ధన్ స్పష్టం చేశారు. కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ సందర్భంగా 375 రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్స్ (ఫార్మర్ అండ్ సర్వైవర్) సెటిల్మెంట్ కాపీలను సంబంధిత అధికారులకు సీ.ఎం.పి.ఎఫ్ రీజినల్ కమిషనర్-2 డా. కే. గోవర్ధన్ అందజేశారు. ఈ సమావేశంలో మందమర్రి ఏరియా డీజీఎం (పర్సనల్) అశోక్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఎస్. శ్రీనివాస రావు (సీఎంపిఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్), కే. వరప్రసాద్ (ఎస్ ఎస్ ఓ), ఏ. రాఘవేంద్ర (ఎస్ ఎస్ ఓ), కే. వెంకటరెడ్డి (ఎస్ ఎస్ ఓ)తో పాటు అన్ని గనుల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలి

**బెల్లంపల్లి, జనవరి 08, ప్రభాతవార్త**



బెల్లంపల్లి పట్టణంలోని చౌడేశ్వరి ప్రాంతంలో ఉన్నటువంటి ఎస్సీ కార్పొరేషన్ అద్వర్యంలో ఉన్నటువంటి దుకాణ సముదాయాల వెనకాల ఉన్నటువంటి ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి ఇంటి నంబర్ పొందిన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కంకటి శ్రీనివాస్ పై చర్యలు తీసుకోవాలని ఆలాగే ఆ ఇంటి నంబర్ రద్దు చేయాలని బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్వి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాల క్రితం బెల్లంపల్లి పట్టణంలో ఎస్సీ కార్పొరేషన్ వారు 6 రూముల దుకాణ సముదాయాన్ని నిర్మించగా ఆ రూముల వెనక ఉన్నటువంటి కాళీ స్థలాన్ని అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్ కబ్జా చేసి ఇంటి నంబర్ (20345) కూడా పొందడం జరిగింది. కావున మీరు తక్షణమే స్పందించి కమర్షియల్ స్థలాన్ని నివాస యోగ్య అయిన స్థలంగా తప్పుడు పత్రాలు సృటించి అధికారులను తప్పుదోవ పట్టించి ఇంటి నంబర్ (20345) పొందడం జరిగింది. కావున మీరు వెంటనే విచారణ జరిపి ఆ నంబర్‌ను రద్దు చేసి అధికారులను తప్పుడోవపట్టించిన వారిపై చర్యలు తీసుకోవాలి అని బిఆర్ఎస్వి డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు ఆడెపు అరుణ్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బుద్ధర్తి సుమంత్, కార్యదర్శి వడ్డేపల్లి నితీష్, నాయకులు సుంకరి నరేష్, శ్రావణ్, తరుణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

అర్థమయ్యే రీతిలో బోధించాలని, తెలుగు, ఇంగ్లీష్ భాషలలో పట్టు సాధించేలా చదవడం, మాట్లాడటం, రాయడం తప్పనిసరిగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్ణీత గడువులో సిలబస్ పూర్తి చేయాలని, విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. గత విద్యా సంవత్సరంలో 96.4 శాతం ఫలితాలు సాధించడం జరిగిందని, ఈ విద్యా సంవత్సరంలో పూర్తి స్థాయిలో సాధించేలా అంకితభావంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని హోటల్ కుందన లో మంచిర్యాల, నిర్మల్ జిల్లాలకు చెందిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులు, ఆదర్శ పాఠశాలల బాలికల సంక్షేమ వసతి గృహాల వార్డెన్ లకు నిర్వహించిన 2వ రోజు శిక్షణ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారితో కలిసి హాజరయ్యారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో బాలికలకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారికి భద్రత, భరోసా అందించాలని తెలిపారు. ప్రభుత్వం విద్య అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఈ క్రమంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో బాలికల విద్యకు ప్రాముఖ్యత అందిస్తుందని తెలిపారు. అధికారులు, సిబ్బంది శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలలలో అమలు చేయాలని తెలిపారు. జిల్లా విద్యాధికారి, ప్రత్యేక అధికారులు బాలికా విద్యపై ప్రదర్శించిన నాటికను అందరు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఏ సి జి ఈ మల్లేశం, సమగ్ర శిక్ష సమన్వయకర్తలు భరత్, సత్యనారాయణమూర్తి, నిర్మల్ జిల్లా సమన్వయకర్త నవీన జ్యోతి, సహాయ సమన్వయకర్త రమాదేవి, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, మాస్టర్ ట్రైనర్ జ్యోతి, పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బిజెపి నాయకుడు

## మంచిర్యాల కబడ్డీ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించిన రఘునాథ్ వెరబెల్లి

**మంచిర్యాల, జనవరి 8, ప్రభాతవార్త**

స్వామి వివేకానంద జయంతి, సంక్రాంతి పండుగ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మంచిర్యాల కబడ్డీ ప్రీమియర్ లీగ్‌కు గురువారం మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడాకారుల ఎంపిక పోటీలను రఘునాథ్ ప్రారంబించారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది కబడ్డీ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెరబెల్లి రవీందర్ రావు, రామ్ చందర్, సతీష్ రావు, తదితరులు పాల్గొన్నారు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

## జనాభా ప్రాతిపదికన వార్డుల్లో రిజర్వేషన్లు కేటాయించాలని కలెక్టర్‌కు వినతి పత్రం

### - బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి

**మంచిర్యాల, జనవరి 8, ప్రభాతవార్త**

మున్సిపల్ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, ఇతర మున్సిపాలిటీల్లో వార్డుల్లో ఉన్న జనాభా మరియు కుల గణన ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించాలని, ముసాయిదా ఓటర్ లిస్టులో ఉన్న తప్పులను సవరించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేషన్ మరియు ఇతర మున్సిపాలిటీల్లో జనాభా ప్రాతిపదికన వార్డుల్లో రిజర్వేషన్లు కేటాయించాలని అదే విధంగా ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ పురపాలిక చట్టం 2019 ప్రకారం అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్రం రమేష్, కుర్రె చక్రవర్తి, మోతే సుజాత, బియ్యాల సతీష్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### - మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రయ్య

**నస్పూర్, జనవరి 8, ప్రభాతవార్త**

సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రయ్య అన్నారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ శిక్షణ సంస్థ డా. ఎంసీఆర్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ తెలంగాణ (ఎం.సి.ఆర్.హెచ్.ఆర్.డి.) రైట్ టు ఇన్ఫర్మేషన్ చట్టం - 2005 (ఆర్. టి. ఐ. చట్టం) పై జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు నిర్వహించిన 2 రోజుల శిక్షణ కార్యక్రమానికి ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ ద్వారా ఉద్యోగులకు సమాచార హక్కు ( ఆర్.టి.ఐ.) చట్టం ముఖ్య ఉద్దేశాలు, చట్టంలోని ప్రధాన నిబంధనలు, మినహాయింపులు, అప్పీలు విధానం, ప్రజా సమాచార అధికారి (పి.ఐ.ఓ.), సహాయ ప్రజా సమాచార అధికారి (ఏ.పి.ఐ.ఓ.), ఫస్ట్ అప్పీలెట్ అథారిటీ (ఎఫ్.ఏ.ఏ.)ల బాధ్యతలు వంటి అంశాలపై వివరించారు. సమాచార హక్కు చట్టం ఆవిర్భావం, లక్ష్యాలు, పౌరుల హక్కులు, అభ్యర్థన దాఖలు విధానం, రుసుములు, కాలపరిమితులు, సమాచార మినహాయింపులు, వ్యక్తిగత గోప్యత ప్రజాహిత అంశాలు, ఫస్ట్ అప్పీల్, సెకండ్ అప్పీల్ ప్రక్రియ, ఉత్తమ అమలు పద్ధతులు గురించి శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రజలకు మరింత పారదర్శక, బాధ్యతాయుత పరిపాలన అందించడంలో సమాచార హక్కు చట్టం కీలక సాధనం కావడంతో, ఈ శిక్షణ ద్వారా సమాచార హక్కు చట్టం సమర్థవంతమైన అమలుకు అవసరమైన అవగాహన, నైపుణ్యాలు పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి కార్యాలయంలో ఆర్.టి.ఐ. రిజిస్టర్ పకడ్బందీగా నిర్వహించాలని, తద్వారా సంబంధిత నివేదికలు తయారు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ (శిక్షకుడు) కిషన్, ఎం.సి.ఆర్.హెచ్.ఆర్.డి., ఉద్యోగులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## జైపూర్‌లో టీఎన్జీవో సభ్యత్వ నమోదు

**జైపూర్, జనవరి 08, ప్రభాతవార్త**

గురువారం జైపూర్ తహశీల్దార్‌కార్యాలయంలో టీఎన్జీవో సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపట్టారు. మందమర్రి టీఎన్జీవో యూనిట్ అధ్యక్షులు సుమన్ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వం నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి హాజరయ్యారు. టీజివో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు వనజ, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్ ఆధ్వర్యంలో టీఎన్జీవో సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ రెవెన్యూ, పంచాయతీ రాజ్, అగ్రికల్చర్, ఇతర శాఖల నుండి 100 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులు టీఎన్జీవో సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కరించడంలో టీఎన్జీవో ముందు ఉంటుందని అన్నారు. జనవరి 10లోపు సభ్యత్వాలు పూర్తిచేసి రాష్ట్రంలోనే మంచిర్యాల జిల్లా ఆదర్శంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మందమర్రి యూనిట్ కార్యదర్శి సత్యనారాయణ, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





పెన్షన్ చెల్లింపు పత్రాలను అందజేస్తున్న దృశ్యం

# సింగరేణిలో పెన్షన్ సేవలు వేగవంతం: జీరో పెండెన్సీ లక్ష్యం

### - శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో సీఎంపీఎఫ్ ప్రయాస్ సమావేశం

**నస్పూర్, జనవరి 8, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సామాజిక భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ భవిష్య నిధి, పెన్షన్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నిర్ణయించారు. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం సీఎంపీఎఫ్ ఆధ్వర్యంలో 5వ ప్రయాస్, కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. సింగరేణిలో భవిష్య నిధి క్లెయిమ్స్, పెన్షన్ దావాల పరిష్కారంలో జాప్యం లేకుండా చూస్తూ జీరో పెండెన్సీ సాధించడమే ఈ సమావేశ ముఖ్య ఉద్దేశమని అధికారులు వెల్లడించారు. డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామగుండం రీజినల్ కమిషనర్-2 కె. గోవర్ధన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 266 రివైజ్డ్ పీపీఓ కాపీలను అందజేశారు. ఉద్యోగులకు కేటాయించే సీఎంపీఎఫ్ నంబర్ల ప్రక్రియతో పాటు, పదవీ విరమణ పొందిన వారి క్లెయిమ్‌లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అనిల్ కుమార్ కోరారు.

సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్-2 కె. గోవర్ధన్ మాట్లాడుతూ, బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న పెన్షన్ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం భవిష్య నిధి లావాదేవీలన్నీ జసి కేర్స్ చ పోర్టల్ ద్వారా జరుగుతున్నాయని, దీనివల్ల మధ్య దళారుల ప్రమేయం లేకుండా పారదర్శక సేవలు అందుతున్నాయని వివరించారు. సి కేర్స్ పోర్టల్ ద్వారా సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ ఎం. కొమురయ్య, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎస్. సురేందర్, సీఎంపీఎఫ్ కార్యాలయ సిబ్బంది, గనుల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

# సిపిఐ బహిరంగ సభను జయప్రదం చేయండి

### - వేమనపల్లిలో సిపిఐ నాయకుల పిలుపు

**వేమనపల్లి, జనవరి 8, ప్రభాతవార్త**



సిపిఐ శత జయంతి సందర్భంగా ప్రచార జాత గురువారం 6వ రోజు వేమనపల్లి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా జాతకు నాయకత్వం వహిస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్ కు మండల సిపిఐ మండల కార్యదర్శి అందే పురుషోత్తం, నేషనల్ హెల్త్ స్కీమ్ జిల్లా కార్యదర్శి దేవరబోయిన బాపు పూలమాల వేసి స్వాగతం పలికారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 10వ తేదీన మందమర్రి మండలం రామకృష్ణపూర్ లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని అదే విధంగా ఈ నెల 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దేవర బోయిన చిన్న శంకర్ మహేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జోగుల మల్లయ్య , చెన్నూరు మండల కార్యదర్శి నెన్నెల సమ్మయ్య, చెన్నూరు పట్టణ కార్యదర్శి చందు, మాజీ సర్పంచ్ సూత్రాల నారాయణ, బడికెల మధునయ్య, రేగళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో వార్తా పత్రికలది కీలక పాత్ర

**మందమర్రి, జనవరి 08, ప్రభాతవార్త**

సమాజంలో జరిగే సంఘటనలను ప్రజలకు చేరవేయడంలో వార్తాపత్రికలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రజలు-ప్రభుత్వం మధ్య అనుసంధాన వంతెనగా నిలుస్తూ, ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిగా పనిచేస్తున్నాయి. సమాచార ప్రసారంలో ముందంజ.. దేశం నలుమూలల నుంచి జరుగుతున్న రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిణామాలను ప్రజలకు చేరవేయడంలో వార్తాపత్రికలు ముందుంటాయి. నిష్పక్షపాతంగా నిజాలను ప్రజల ముందుకు తీసుకురావడం ద్వారా సమాజాన్ని అప్రమత్తం చేస్తాయి. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలతో పాటు వార్తాపత్రికలను ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా పరిగణిస్తారు. ప్రభుత్వ విధానాలపై విమర్శలు, సూచనలు చేస్తూ ప్రజల హక్కులను కాపాడే బాధ్యతను నిర్వర్తిస్తాయి. ప్రజా సమస్యలకు గొంతుగ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ప్రజల సమస్యలను వెలుగులోకి తెస్తూ పరిష్కారానికి దారి చూపుతాయి. నిరక్ష్యం, అవినీతి, అన్యాయాలపై ప్రశ్నలు లేవనెత్తి బాధ్యత వహించాల్సిన వారిని నిలదీస్తాయి. విద్య, ఆరోగ్యం, పర్యావరణం, సంప్రదాయాలు, సాహిత్యం వంటి అంశాలపై ప్రత్యేక కథనాలు ప్రచురిస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందిస్తాయి. యువతలో పఠన అలవాటును పెంచడంలో కూడా వార్తాపత్రికల పాత్ర అమూల్యం. సమాజంలోని మూఢనమ్మకాలు, అసమానతలు, సామాజిక దోపిడీపై కథనాలు రాసి మార్పు కోసం చైతన్యం కలిగిస్తాయి. అనేక సామాజిక ఉద్యమాలకు వార్తాపత్రికలే ప్రేరణగా నిలిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. నిజాయితీ, నిష్పక్షపాతత, బాధ్యతతో వార్తాపత్రికలు పనిచేస్తే సమాజం సక్రమ దిశలో ముందుకు సాగుతుంది. సమాచార యుగంలోనూ వార్తాపత్రికలు తమ విలువను నిలుపుకుంటూ ప్రజల హితాన్ని కాపాడే బాధ్యతను నిర్వర్తిస్తున్నాయి.



మందమర్రి సీఐ చేతుల మీదుగా వార్త క్యాలెండర్ ఆవిష్కరణ

**వార్త క్యాలెండర్ ఆవిష్కరణ..**

మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్ చేతుల మీదుగా వార్త క్యాలెండర్‌ను గురువారం రోజున ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వార్త రిపోర్టర్ బత్తుల సతీష్, బెల్లంపల్లి వార్త రిపోర్టర్ మేకల భీమయ్య పాల్గొన్నారు.



## గాందారి మైసమ్మను దర్శించుకున్న దేవాదాయ శాఖ డైరెక్టర్

**రామకృష్ణాపూర్, జనవరి 08, ప్రభాతవార్త**

మందమర్రి మండలం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బొక్కలగుట్ట ప్రాంతంలో జాతీయ రహదారి ఆనుకొని కొలువు దీరిన గాంధారి మైసమ్మను గురువారం ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ డైరెక్టర్ రంగు రవి దర్శించుకున్నారు. ఈ పర్యటనలో బాగంగా గాందారి మైసమ్మఆలయాన్ని సందర్శించి, ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి, కమిటీ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భక్తులు ఎంతో నమ్మకంగా సంవత్సరం కాలం అమ్మవారిని దర్శించుకుంటారని, భక్తులకు సరైన వసతులు లేవని, దేవాలయం చుట్టూ భక్తులకు, పార్కింగ్ కోసం సరైన స్థలం లేకపోవడం చాలా ఇబ్బందిగా ఉందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొక్కలగుట్ట గ్రామ సర్పంచ్ మాస్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజ, మాజీ కౌన్సిలర్ పనాస రాజు, గోపూ రాజం, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు బోనగిరి రవీందర్, పూజారులు పాల్గొన్నారు.

# అఖిలభారత పులుల లెక్కింపుపై అవగాహన సదస్సు

**ఉట్నూర్, జనవరి 8, ప్రభాతవార్త :**


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉట్నూర్ లో జంతు శాస్త్ర వృక్ష శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సు లో ఈనెల 19వ తేదీ నుండి అటవీ శాఖ వారు చేపట్టబోయే అటవీ జంతువుల లెక్కింపులో స్వచ్ఛందంగా పాల్గొంటున్న విద్యార్థులకు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సిహెచ్ ప్రియాంక, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాథోడ్ ప్రవీణ్ కుమార్ లు ఎకాలజీ ఆప్ ను ఉపయోగించి అటవీ జంతువులను లెక్కించే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డా. ఎ. రాణి మాట్లాడుతూ విద్యార్థులు అరుదుగా దొరికే ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని అడవులు పర్యావరణం పరిరక్షణపై తమ వంతు బాధ్యతను తెలుసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నర్సింగ్ రావు, కరుణాకర్, శ్రీకాంత్, రాజ్కుమార్, డాక్టర్ శ్రీనివాస్, ప్రజ్ఞా, స్ఫూర్తి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.


కొత్తపల్లి సర్పంచ్ ఆకులు వెంకటేశం సన్మానించిన బిజెపి నాయకులు

## సర్పంచ్‌లను సన్మానించిన బిజెపి నాయకులు

**తాండూర్, జనవరి 8, ప్రభాతవార్త :**

మండలంలోని కిష్టంపేట, కొత్తపల్లి గ్రామపంచాయతీలకు నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు సార్ల తిరుపతి, ఆకుల వెంకటేష్ లను గురువారం బిజెపి నాయకులు ఘనంగా సన్మానించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ముందుండి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు రామగౌని మహీధర్ గౌడ్, చిలుముల శ్రీకృష్ణదేవరాయులు, చిలువేరు శేషగిరి, సిద్ధం మల్లేష్, పుట్ట కుమార్, కోమండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో విద్యార్థులు రాణించాలి

**తాండూర్, జనవరి 8, ప్రభాతవార్త :**

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని తాండూర్ ఇన్చార్జ్ ఎంపీడీవో వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని తంగళ్ళపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల వద్ద గురువారం సీఎం కప్ టార్చ్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగివున్న క్రీడా ప్రతిభను వెలికి తీయడమే సీఎం కప్ లక్ష్యమన్నారు. మండల స్థాయిలో రాణించిన విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. అంతకు ముందు తంగళ్ళపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల నుండి ఐబి జాతీయ రహదారి చౌరస్తా వరకు అధికారులు, ఉపాధ్యాయులు, పీఈటిలు, గ్రామ కార్యదర్శులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

# టార్చ్ ర్యాలీతో యువతలో క్రీడా ఉత్సాహం

**- గ్రామీణ యువత ప్రతిభ వెలికితీతకు రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం - గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు దశలవారీ పోటీలు**

**- ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు, శిక్షణ అవకాశాలు**

**మందమర్రి, జనవరి 8, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధి, యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సి.ఎం. కప -2026 కార్యక్రమం మందమర్రి మండలంలో గురువారం రోజున మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్, మండల పంచాయతీ అధికారి ఎం. సత్యనారాయణ, మండల విద్యాధికారి రమేష్ రాథోడ్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మండల అధికారులంతా విద్యార్థులతో కలిసి టార్చ్ ర్యాలీ నిర్వహించి కార్యక్రమానికి శుభారంభం పలికారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు కల్పించి, క్రీడల ద్వారా ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణతో కూడిన సమాజాన్ని నిర్మించడమే ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు పేర్కొన్నారు. వివిధ దశల్లో పోటీలు – ప్రతిభకు ప్రోత్సాహంసి.ఎం. కప్ – 2026 పోటీలలో వివిధ క్రీడాంశాలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి, వారికి తగిన ప్రోత్సాహకాలు, శిక్షణ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.



సీఎం కప్ టార్చ్ ర్యాలీలో అధికారులు

**క్రీడ పోటీల షెడ్యూల్ ఈ విధంగా ఉంది..**

జనవరి 17 నుంచి 22 వరకు – గ్రామ స్థాయిజనవరి 28 నుంచి 31 వరకు – మండల స్థాయిఫిబ్రవరి 3 నుంచి 7 వరకు – నియోజకవర్గ స్థాయిఫిబ్రవరి 10 నుంచి 14 వరకు – జిల్లా స్థాయిఫిబ్రవరి 19 నుంచి 26 వరకు – రాష్ట్ర స్థాయిఈ పోటీలు యువతలో క్రీడలపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీలకు మార్గదర్శకంగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

**అందరి సమన్వయంతోనే విజయం..**

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సంబంధిత అధికారులు, స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలు, క్రీడా సంఘాలు, యువత సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు.

ఈ ప్రారంభ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల కార్యాలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



తాండూర్‌లో నిర్వహిస్తున్న సీఎం కప్ టార్చ్ ర్యాలీ

# ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ






బెల్లంపల్లిలో విద్యార్థుల టార్చి ర్యాలీ

**వేమనపల్లి, జనవరి 8, ప్రభాతవార్త**

వేమనపల్లి మండల కేంద్రంలో గురువారం సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ రాజారాం క్రాస్ రోడ్డు నుండి వేమనపల్లి ప్రాథమిక పాఠశాల వరకు ఉత్సాహంగా సాగిందని ఎంపిడిఓ కుమారస్వామి అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ త్వరలో సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. పల్లె నుండి ప్రపంచ స్థాయి వరకు క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం కోసం గ్రామస్థాయి నుండి క్రీడా స్ఫూర్తి కలిగిన క్రీడా స్ఫూర్తి కలిగిన యువకుల్ని వెలికి తీసే ప్రయత్నంలో భాగంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడల్ని ప్రదర్శించే కార్యక్రమం ఉంటుందని ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేరును అధికారిక వెబ్సైట్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీధర్ రెడ్డి, ఆర్ఐ ఖాలిక్, పీఈటి మల్లేష్, సర్పంచ్ లు వుప్పలపు సాయికృష్ణ, చెన్నూరి సమ్మయ్య పోలీస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి, జనవరి 08, ప్రభాతవార్త**

విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సీఎం కప్పు విజయవంతం చేయాలని కోరుతూ గురువారం బెల్లంపల్లి పట్టణంలో ఎంపీడీవో ఎం.మహేందర్ విద్యార్థులతో కలిసి టార్చి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని సింగరేణి నెంబర్ వన్ తిలక్ క్రీడ మైదానం నుంచి కాంట్రాక్ట్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ క్రీడల పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ ను నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకొని జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని మహేందర్ సూచించారు. ఈ ర్యాలీలో బజార్ ఏరియా మైనార్టీ రెసిడెన్షియల్ సిఓఈ గర్ల్స్, రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పాటు ఎంపీవో శ్రీనివాస్, మాజీ ఎంఈవో పి. మహేశ్వర్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు బొంకూరి బాబురావు, బండి. రవి కుమార్, ఎస్కె. రాజ్ మహమ్మద్, ఎండీ చాంద్ పాషా, తోట పద్మ, పీఈటీ లు వామన్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

**బజార్‌హత్నూర్, జనవరి 08, ప్రభాతవార్త:**

ఈ నెల 17 నుండి 23 వరకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు జరుగనున్నాయి. అందుకు సంబందించిన సీఎం కప్ రెండవ ఎడిషన్ టార్చ్ రిలే ర్యాలీ గురువారం మండల కేంద్రానికి చెరుకుంది. స్థానిక తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో కే శ్రీనివాస్, యంపిఓ మహేందర్ రెడ్డి, సర్పంచ్ పరచ సాయన్న, ప్రధానోపాధ్యాయులు జే భూమన్నలు ర్యాలీ నిర్వహకులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పేట కార్యదర్శి జె సాయి, కబీర్ దాస్ కోచ్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహకులకు స్వాగతం పలుకుతున్న అధికారులు



లబ్ధిదారునికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఆడే గజేందర్

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు పెన్నిది

### - ఆడే గజేందర్

**ఇచ్చోడ, జనవరి 8, ప్రభాతవార్త:**

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు పెన్నిది అని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రానికి చెందిన మహమూద్‌కు రూ. 60,000/ సీఎం సహాయ నిధి చెక్కులను ఆడే గజేందర్ నేరేడిగొండలోని తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ వైద్యపరంగా ఆపదలో ఉన్నవారు చికిత్స కోసం సకాలంలో ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కళ్లెం నారాయణరెడ్డి, బోథ్ సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రూప్లసింగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుక రాములు, రాథోడ్ వసంతరావు, పోతారెడ్డి, ఎండి సద్దాం, ముస్తఫా, సదానందం, మురళి గౌడ్, సాయన్న మజీద్, ప్రశాంత్, రామ్‌లక్ష్మణ్ తదితరులున్నారు.



షేక్ రాజ్‌మహమ్మద్ కుటుంబాన్ని పమార్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## బాధిత కుటుంబానికి పరామర్శ

**ఇచ్చోడ, జనవరి 8, ప్రభాతవార్త:**

మండలంలోని బోరిగామ గ్రామానికి చెందిన షేక్ రాజ్ మొహ్మద్ మనవరాలు స్వర్గస్తులైన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మనవరాలు చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రజా బాట

**ఇచ్చోడ, జనవరి 8, ప్రభాతవార్త:**

మండంలోని గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రజా బాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఈ జాదవ్ రాజు అన్నారు. గురువారం ముఖరా(కే)లో ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ జాదవ్ రాజు మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని లోవోల్టేజీ, ఓవర్ లోడ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జైపాల్, పవర్ బాలాజీ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్, విద్యుత్ అధికారులు, గ్రామస్తులు

## ఆరెగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముగ్గుల పోటీలు

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 8, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మండలం ఆరెగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం పిఎన్ఎం, డివైఎఫ్ఐ, కెవిపిఎస్, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, ఆట పాట పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పోటీ పడి ముగ్గులు వేసి పాటలు పాడారు. ఈ సందర్భంగా పిఎన్ఎం జిల్లా కార్యదర్శి సుధాకర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలలో భాగంగా ఈ పాఠశాలలో ముగ్గుల పోటీలు ఆటపాట, మాట కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. అనంతరం ముగ్గుల పోటీ, ఆటపాట పోటీలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎన్ఎమ్ జిల్లా అధ్యక్షురాలు గోగర్ల పావని, జిల్లా కోశాధికారి ఆర్ మహేష్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షు దుర్గం నిఖిల్ , కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగేష్, గ్రామ సర్పంచ్ పద్మ, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం కొమ్ము లక్ష్మీనారాయణ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, విజయలక్ష్మి, రౌతు రవి, గ్రామ పెద్దలు భీమన్ కార్ గణపతి,అలగం దేవాది తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు,తదితరులు



మాట్లాడుతున్న ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్

## పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలు అందేలా చూస్తాం

**ఉట్నూర్, జనవరి 8, ప్రభాతవార్త :**

ఐటీడీఏ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ లో మీటింగ్ చూసిన అనంతరం గురువారం ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉట్నూర్ పరిధిలో నిర్వహించబడుతున్న గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలు అందరికీ అందేలా చూస్తామని, జిపిఎస్ పాఠశాల కొరకు, ఆశ్రమ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడానికి, ఏమైనా మరమ్మత్తులు ఉన్నట్లయితే ప్రతిపాదనలు తయారు చేసి పనులు ప్రారంభించి ఫిబ్రవరి 15వ తేదీ వరకు పూర్తి చేస్తామని, పోడు పట్టా కలిగిన రైతులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించి వారికి రైతు భరోసా, బ్యాంకు ద్వారా ఇతర రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడి, ఏటీడిఓ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు

## - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జనవరి 08, ప్రభాతవార్త:**

రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించినప్పుడే అమూల్యమైన మానవ ప్రాణాలను కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెంబర్-1లో నిర్వహించిన 2026 జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు" అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు రోడ్డు భద్రతపై ప్రదర్శించిన నాటికలు, ఉపన్యాసాలు అందరినీ ఆలోచింపజేశాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు భద్రతపై అవగాహన కేవలం పెద్దలకే కాకుండా చిన్ననాటి నుంచే విద్యార్థులకు కలగాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అతివేగం అత్యంత ప్రమాదకరమని, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులు తమ తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. 18 సంవత్సరాల లోపు పిల్లలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. రోడ్డు సంకేతాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తుచేశారు. రోడ్డు భద్రతతో పాటు చదువుపై కూడా దృష్టి సారించి, రాబోయే పదవ తరగతి పరీక్షల్లో కష్టపడి చదివి జిల్లాను




అగ్రస్థానంలో నిలబెట్టాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు, విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, మండల విద్యాధికారి సోమయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలాదేవి, కోఆర్డినేటర్ తిరుపతి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నాడు పతి... నేడు సతి

## - సర్పంచ్ పసుల పార్వతి

**సిర్పూర్(టి), జనవరి 8 ప్రభాతవార్త:**





స్థానిక సంస్థల ఎన్నికల్లో అనేక అనూహ్య ఘటనలు జరిగాయి. భర్త స్థానంలో భార్య వదిన స్థానంలో మరిది సర్పంచులుగా ఎన్నిక య్యారు. మండలంలోని కర్జపల్లి గ్రామపంచాయతీకి గతంలో శ్రీనివాస్ సర్పంచ్ ఎన్నిక కాగా ఇప్పుడు ఆయన భార్య పార్వతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ పార్వతి వార్త దినపత్రికతో మాట్లాడారు. ఎన్నికల నేపథ్యం గ్రామాభివృద్ధిపై తన ప్రణాళికను వెల్లడించారు. రెండోసారి సర్పంచ్‌గా గ్రామ ప్రజల ఆశీర్వాదంతో అత్యధిక మెజారిటీతో గెలిపించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామంలో పెండింగ్లో ఉన్న రోడ్లు డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తానని ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులను సద్వినియోగం చేసి మౌలిక వసతులు అభివృద్ధికి ప్రాధానమిస్తానని అన్నారు. గ్రామ అభివృద్ధి తన లక్ష్యమని ప్రజల సహకారంతో కర్జపల్లి ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని నూతన సర్పంచ్ పసుల పార్వతి వార్త దినపత్రికతో తెలిపారు.

# ఘనంగా కొలవార్ 24వ భీమన్న దేవర జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరణ చేస్తున్న కొలవార్ కులస్తులు

**బెజ్జూర్, జనవరి 8, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల వ్యాప్తంగా గురువారం ఆదివాసి కొలవార్ ఆత్మగౌరవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొలవార్ కులస్తులు 24వ భీమన్న దేవర జెండా ఆవిష్కరణ చేశారు. మన్నేవారుగా ఉన్న కొలవార్ సామాజిక వర్గాన్ని పివిటీజీగా గుర్తించి తమకు హక్కులను కల్పించాలని, ఐటీడీఏ ద్వారా 100 రాయితీపై రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోలవార్ సంఘం మండల అధ్యక్షుడు పెద్దల సంతోష్ కోరారు. గోల్కొండలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి తహసిల్దార్ రామ్మోహన్ రావు, ఎస్ఐ సర్తాజ్ పాషా, ఎంఈఓ సునీత, సర్పంచ్ దుర్గం సరోజ తిరుపతి, కొలవార్ కులస్తులు, బిఆర్ఎస్ నాయకులు అమీరుద్దీన్, జాకీర్, మల్లేష్, ఆదర్శ్ పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 8, ప్రభాతవార్త :**

ఆదివాసీ కొలవార్ల ఆత్మగౌరవ దినోత్సవం సందర్భంగా కాగజ్ నగర్ మండలంలోని గువ్వలగూడ గ్రామంలో గురువారం భీమదేవర జెండా పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొలవార్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్రా పోచయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొలవార్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్రా వెంకటేష్, రాష్ట్ర నాయకులు బుర్రా రంగయ్య, మండల అధ్యక్షుడు ఎర్గటి విలాస్, నాయకులు ఠాకూర్ నాగేందర్ సింగ్, నాగంపేట్ సర్పంచ్ గజ్జి లింగయ్య, ఉప సర్పంచ్ కట్టెకొల పోచమల్లు, గువ్వల భీమయ్యా, నర్సింహులు, విజయ, సంజీవ్ , నరేందర్, లు పాల్గొన్నారు



భీమదేవర జెండా పండుగ కార్యక్రమంలో పాల్గొన్న ఆదివాసి కొలవార్ నాయకులు

**చింతలమానేపల్లి, జనవరి 8, ప్రభాతవార్త:**

మండల వ్యాప్తంగా ఆదివాసీ గిరిజనులు భీమన్న దేవర జెండా పండుగను అత్యంత ఉత్సాహంతో నిర్వహించారు. ఈ పండుగ సందర్భంగా గ్రామాల్లో సంప్రదాయ పూజలు, సామూహిక ప్రార్థనలు జరగడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భీమన్న దేవర ఆలయాల వద్ద జెండా పూజలు నిర్వహించి, దేవర ఆశీస్సులతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, పంటలు పుష్కలంగా పండాలని కోరుకున్నారు. ఆదివాసీ కోలావర్, మన్నెవార్ సమాజాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జెండా పండుగకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో గిరిజన నాయకులు మాట్లాడుతూ, ఆదివాసీ ఆచారాలు వారి జీవన విధానానికి ప్రతీకలని పేర్కొన్నారు. సంప్రదాయాలను కాపాడుకోవడం ద్వారా తమ గుర్తింపును నిలుపుకోవచ్చని తెలిపారు. పండుగ వేళ గ్రామాల్లో డప్పు వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలు, రంగురంగుల వేషధారణలు ఉత్సవ శోభను పెంచాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సర్పంచులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసిన ఆదివాసి కోలావార్, మన్నెవార్ సభ్యులు




సమావేశంలో మాట్లాడుతున్న ఎంవిఐ

# రోడ్డు భద్రత అందరి బాధ్యత

## - ఏంవీఐలు యశ్వంత్, రవీందర్

**ఉట్నూర్, జనవరి 8, ప్రభాతవార్త :**

రోడ్డు భద్రత అందరి బాధ్యత అని ఏంవీఐలు యశ్వంత్, రవీందర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ అద్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ జిల్లా మెంబర్ దూట రాజేశ్వర్, ఏంవీఐలు యశ్వంత్, రవీందర్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బైక్ నడిపే ప్రతి ఒక్కరూ కచ్చితంగా హెల్మెట్ ధరించడం మానుకోవద్దన్నారు. బైక్ పై కూర్చున్న రెండవ వ్యక్తి సైతం హెల్మెట్ ధరించాలన్నారు. 18 సంవత్సరాలు నిండి బైక్ ఉన్న వారందరూ డ్రైవింగ్ లైసెన్స్ పొందాలన్నారు. అతివేగంగా డ్రైవింగ్ చేయవద్దని, ర్యాంగ్ రూట్ లలో ప్రయాణించవద్దని, ప్రయాణంలో అందరూ జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటుందన్నారు. ముఖ్యంగా యువత ఇష్టమచ్చినట్లు డ్రైవింగ్ చేస్తున్నారని ఆర్టీఏ యాక్ట్ లో కేసులు నమోదుతో బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రైవింగ్ లో అందరూ బాధ్యతగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ఇన్ ఛార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాణి, ఏఎంవీఐ ఫైమా సుల్తానా, రంజిత్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రాజశేఖర్, కాలేజ్ సిబ్బంది ఉన్నారు.

# రహదారి బాధ్యతలు ప్రతి ఒక్కరిది

## - బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బానోత్ జైవంత్ రావు

**ఉట్నూర్, జనవరి 8, ప్రభాతవార్త :**

రహదారి బాధ్యలు ప్రతి ఒక్కరిదని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బానోత్ జై వంత్ రావు అన్నారు. గురువారం మండలంలోని ఆర్ టీ సి బస్టాండ్ లో రహదారి భద్రత పోస్టర్ లను విడుదల చేశారు. జైవంత్ రావు మాట్లాడుతూ యువత వాహనాలు నడిపే వారు తప్పకుండ లైసెన్స్, హెలిమెంట్, వాహన భీమా కల్గి ఉండాలన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్టీసి సిబ్బంది లు ఉన్నారు.



# నూతన సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం



సర్పంచులకు సన్మానిస్తున్న అధికారులు

**బజార్‌హత్నూర్, జనవరి 08, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నూతనంగా ఎన్నికైన సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మోహన్, ఎంపీడీవో కే శ్రీనివాస్, తహసిల్దార్ శ్యామ్ సుందర్ అధ్యక్షతన మండలంలోని 31 గ్రామ పంచాయతీలోని సర్పంచులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక అధికారి మాట్లాడుతూ అందరు కలిసి కట్టుగా పని చేసి తమ తమ గ్రామ పంచాయితీలు అభివృద్ధి పదంలో తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసిన పోలీసులు

బెల్లంపల్లి, జనవరి 08, ప్రభాతవార్త




కన్నెపల్లి సబ్ స్టేషన్ వద్ద కన్నెపల్లి ఎస్ఐ భాస్కర్ రావు వాహనములు తనిఖీ చేసిండగా బైక్ మీద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా వస్తూ పోలీసు వారిని చూసి పారిపోవుచుండగా పోలీస్ వారు వారిని పట్టుకుని చెక్ చేయగా వారి వద్ద 20 గ్రాముల గంజాయి లభించింది వారిని విచారించగా సుందిళ్ల ప్రభాకర్ చింతపూడి గ్రామం, రౌతు మారుతి లింగాల గ్రామం అని తెలిపినారు. వారికీ బెల్లంపల్లి లోని రాడగంబాల బస్తీకి చెందిన పిడుగురాళ్ల చందర్ అనే వ్యక్తి అమ్మి నాడు అని చెప్పగా బెల్లంపల్లికి వెళ్లి అతని కూడా పట్టుకొని అతనిని సోదా చేయగా అతని వద్ద 100 గ్రాములు గంజాయి దొరికింది. అట్టి గంజాయిని ఇద్దరు పంచుల సమక్షంలో పంచనామ నిర్వహించి పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చి ముగ్గురిపై కేసు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా తాండూర్ సిఐ దేవయ్య మాట్లాడుతూ ఎవరైనా గంజాయ్ తాగడం గాని అమ్మడం గాని చేసినట్లయితే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మరియు ఎవరికైనా గంజాయి గురించి సమాచారం తెలిస్తే పోలీస్‌కు తెలపండి వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయని అని తాండూర్ సిఐ దేవయ్య తెలిపారు. ఈ సందర్భంగా కన్నెపల్లి ఎస్ఐ భాస్కర్ రావు, సిబ్బందిని అభినదించారు.




## మండల స్థాయి ఆరోగ్య పాఠశాల క్విజ్ పోటీలు

బజార్‌హత్నూర్, జనవరి 08, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాల బజార్‌హత్నూర్‌లో మండల స్థాయి ఆరోగ్య పాఠశాల క్విజ్ పోటీలు గురువారం నిర్వహించారు. ఈ పోటీలలో బజార్‌హత్నూర్, దేగామ, భూతాయి, పిప్పిరి, గిర్నూర్, భుర్కపల్లి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన వారికి ఈ నెల 9న జిల్లా కేంద్రంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి రాంకిషన్ ప్రధానోపాధ్యాయులు జె భూమన్న, మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

## నిమ్స్‌లో పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే

సారంగాపూర్, జనవరి 08, ప్రభాతవార్త:

హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్య కారణంగా చికిత్స పొందుతున్న మండల వాసులను పలువురిని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరామర్శించారు. నియోజకవర్గంలోని కౌట్ల(బి) గ్రామ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ మోహన్‌తో పాటు జాం గ్రామానికి చెందిన మలుకుల భోజనలను నిమ్స్ ఆసుపత్రిలో పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. వారి కుటుంబ సభ్యులకు తను ఉన్నానని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి, జాం గ్రామ సర్పంచ్ విలాస్ తో పాటు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్, ఉప సర్పంచ్‌ను సన్మానించిన ఉపాధ్యాయులు

సారంగాపూర్, జనవరి 08, ప్రభాతవార్త:

మండలంలోని కౌట్ల (బి) జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ మహేందర్ మొదటిసారిగా తమ పాఠశాలకు విచ్చేసిన సర్పంచ్ బల్గూరి అజయ్, ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి లను ఎంఈఓ మహేందర్ శాలువా కప్పి సన్మానించినారు. సర్పంచ్ మాట్లాడుతూ పిల్లలకు మంచి విద్యాబోధనకై కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తానని, పదవ తరగతిలో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పంచాయతీ సెక్రటరీ సుధాకర్ పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్, ఉపసర్పంచ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



సిద్ధంగా ఉన్న 108 అంబులెన్సు సిబ్బంది

## నాగోబా జాతరకు అంబులెన్సుల ఏర్పాటు

ఉట్నూర్, జనవరి 8,ప్రభాతవార్త :

ఆదిలాబాద్ జిల్లా లోని ఇంద్రవెల్లి మండలం లో నిర్వహించనున్న నాగోబా జాతర లో భక్తులకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు భద్రత ను అత్యంత ప్రధాన్యాత ఇస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ల చొరవతో 108 అంబులెన్సు లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా కార్యక్రమ నిర్వాహకులు సమ్రాట్ జిల్లా మేనేజర్ రాజశేఖర్ లు ఉట్నూర్ పరిధిలోని 108 సిబ్బంది తో సమావేశం ఏర్పాటు చేసి అంబులెన్సు లను సిదంగా చేశారు.



కిచెన్ షెడ్ నిర్మాణా పనులను ప్రారంభిస్తున్న ఎంపిడిఓ

## కిచెన్ షెడ్ నిర్మాణ పనులకు శ్రీకారం

పెంచికల్‌పేట్, జనవరి 8, ప్రభాతవార్త

అగర్ గూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ రాజేశ్వరి ఆధ్వర్యంలో కిచెన్ షెడ్ నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆల్బర్ట్ పాల్గొని నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలనే లక్ష్యంతో కిచెన్ షెడ్ నిర్మాణం చేపడుతున్నామని ఎంపిడిఓ తెలిపారు. సర్పంచ్ రాజేశ్వరి మాట్లాడుతూ భవిష్యత్తులో వసతుల కొరత లేకుండా పాఠశాల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈసి జైహింద్, కార్యదర్శి కిష్టయ్య ఫీల్డ్ అసిస్టెంట్ దేవ్ రావు,ప్రధానోపాధ్యాయులు రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం క్రీడా కప్ కాగడ ర్యాలీ

సారంగాపూర్, జనవరి 08, ప్రభాతవార్త:

మండల కేంద్రంలో సీఎం క్రీడ కాప్ కాగడ ర్యాలీని నిర్వహించారు. సారంగాపూర్ పాఠశాల నుండి విద్యార్థిని, విద్యార్థులు వీధుల గుండా వెళుతూ ఎంపీడీవో కార్యాలయంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మీకాంత్ మాట్లాడుతూ గ్రామీణ యువతలోని నైపుణ్యాలను వెలికి తీయడం కోసం ఈ ఆటల పోటీలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ నెల 17 నుండి వచ్చే నెల 26 వరకు జరుగుతాయన్నారు. మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు ఉంటాయని అన్నారు. ఈ పోటీలలో పాల్గొనాలని అనుకునే యువత పంచాయితీ కార్యదర్శులకు తమ జట్టు సభ్యుల పేర్లు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి విజయలక్ష్మి, ఎమ్మార్వో సంధ్యారాణి, స్థానిక సర్పంచ్ కోనేరు భూమన్న, ఎస్సై శ్రీకాంత్, పిఇటిలు, ఉపాధ్యాయులు స్థానిక ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, పంచాయతీకార్యదర్శులు, ఆశా వర్కర్లు, వార్డు సభ్యులు, నాయకులు, యువత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన పత్తిరెడ్డి

సారంగాపూర్, జనవరి 08, ప్రభాతవార్త:

మండలనికి చెందిన కౌట్ల(బి) గ్రామ మాజీ సర్పంచ్ తీగల మోహన్ అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సారంగాపూర్ మాజీ జడ్పీటీసీ సభ్యులు పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో తీగల మోహన్ పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తనవంతు సాయం అందిస్తానని తెలిపారు. తొందరగా కోలుకోవాలని అన్నారు.



మాజీ సర్పంచ్ తీగల మోహన్‌ను పరామర్శిస్తున్న పత్తిరెడ్డి

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా రైతు దినోత్సవ వేడుకలు

**బెల్లంపల్లి, జనవరి 08, ప్రభాతవార్త**

బెల్లంపల్లి శ్రీ చైతన్య స్కూల్లో రైతు దినోత్సవం పురస్కరించుకొని రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించామని ప్రిన్సిపల్ ఓ.రాజేష్ తెలియజేశారు. చిన్నారులు రైతుల వేషాధారణలో కూరగాయలను అమ్ముతు వివిధ కూరగాయలను పండించే విధానాన్ని చిన్నారులు వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాజేష్ మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతును గౌరవించడం మనందరి బాధ్యత అని మనం తినే తిండి వెనక రైతు పడే కష్టం మర్చిపోకూడదని తెలియజేశారు. వృత్తులన్నిటిలోకి ప్రపంచ ఆకలి తీర్చే వ్యవసాయం అనేది చాలా గొప్పదని, అలాంటి వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున రైతులందరికీ మనం ఎప్పటికీ ఋణపడి ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు వీరిని పాఠశాల యాజమాన్యం డైరెక్టర్ శ్రీవిద్య, చైర్మన్ మల్లంపల్లి శ్రీధర్, ఏజీఎం అరవింద్ రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజు లు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ సతీష్, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇంచార్జిలు సౌజన్య, పల్లవి ప్రీ ప్రైమరి ఉపాధ్యాయులు తల్లితండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు భద్రతపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

**పెంచికల్ పేట్, జనవరి 8, ప్రభాతవార్త :**



రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత చట్టాలపై అవగహన పెంపోందించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు లేని జిల్లా నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములుగా మారాలని తెలిపారు. డ్రాయింగ్ ల ద్వారా హెల్మెట్ వినయోగం, సీట్ బెల్ట్ అవసరం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాల్సిన ప్రాముఖ్యతను విద్యార్థులు చక్కగా ప్రతిబింబించినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సాయిలత, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ధ్యానంతో పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసం

**బెల్లంపల్లి, జనవరి 08, ప్రభాతవార్త**

నిత్యం ధ్యానం చేస్తే మనుషులు పరిపూర్ణ వ్యక్తిత్వం ఉన్న ఆదర్శ వ్యక్తులుగా మారుతారని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో మూడు రోజుల పాటు సాగిన ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమాలు గురువారం ముగిశాయి. హార్ట్ ఫుల్ నెస్ సంస్థ మరియు రామచంద్ర మిషన్ ప్రతినిధులు అధికారులు, ఉద్యోగులకు గంట పాటు ధ్యానం పై అవగాహన కల్పించి సాధన చేయించారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ధ్యానంతో రుగ్మతలు తగ్గడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరిగుర ప్రాజెక్ట్ అధికారి మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి హార్ట్ ఫుల్ నెస్ సంస్థ ప్రతినిధులు పి.దీపక్, జయలక్ష్మి, రాజనర్సు, మహేందర్ గౌడ్, జిఎం కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.









గని సందర్శనలో జీఎంతో కలిసి డైరెక్టర్ తిరుమలరావు

# జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో సోలార్ ప్లాంట్ విస్తరణ

### - డైరెక్టర్ తిరుమల రావు

**జైపూర్, జనవరి 08, ప్రభాతవార్త**

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో సోలార్ ప్లాంట్ విస్తరణ చేపట్టానున్నట్లు సింగరేణి ఈ అండ్ ఎం డైరెక్టర్ తిరుమల రావు అన్నారు.గురువారం ఆయన పవర్ ప్లాంట్‌ను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో నూతనంగా ఏర్పాటు చేసే 800 మెగావాట్ల ప్లాంట్ పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సోలార్ ప్లాంట్ విస్తరణకు సంబంధించిన పనులను సైతం సమీక్షించారు. ఈ సందర్భంగా తిరుమల రావు మాట్లాడుతూ మూడో యూనిట్ నిర్మాణ పనులు, వాటి స్థితిగతులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సకాలంలో పూర్తయ్యేలా చూడాలని, సోలార్ ప్లాంట్ విస్తరణలో భాగంగా చేపట్టనున్న పనులను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. వాటి స్థితిగతులు ఎప్పటికప్పుడు పై అధికారులకు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్.టి.టి.పి.పీ ఈ.డి సిహెచ్. చిరంజీవి,ఎస్.టి.పి.పీ జిఎం ఎం. నరసింహ రావు, పి.సి.ఎస్ అండ్ ఓ ఎం జి.ఎం మదన్ మోహన్, సోలార్ జి.ఎం సీతారాం, ఎస్.ఓ.టు డైరెక్టర్ శేఖర్,సోలార్ ఏ.జి.ఎం శ్రీనివాస్, డీజీఎం పంతుల, ఎన్విరాన్మెంట్ డీ.జి.ఎం వాసుదేవ మూర్తి, పర్సనల్ డీజీఎం కిరణ్ బాబు, ఫారెస్ట్ మేనేజర్ చంద్రమణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### మందమర్రి ఏరియాను సందర్శించిన డైరెక్టర్ తిరుమలరావు

**మందమర్రి, జనవరి 8, ప్రభాతవార్త**

మందమర్రి ఏరియాను డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం.తిరుమలరావు గురువారం సందర్శించినారు, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ వారికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి, ఘనంగా స్వాగతం పలికారు, ఈ సందర్భంగా డైరెక్టర్ తిరుమలరావు జి.ఎం ఎన్.రాధాకృష్ణతో కలిసి కేకే ఓసిపి గనిని, 28 మెగావాట్స్ సోలార్ పవర్ ప్లాంట్ ను సందర్శించారు. కేకే ఓసిపి గనిని వ్యూ పాయింట్ నుండి పని స్థలాలను పరిశీలించారు. అనంతరం మందమర్రి మోడల్ స్కూల్ వద్ద గల 28 మెగా వాట్ సోలార్ పవర్ ప్లాంట్‌ను సందర్శించారు. పవర్ ప్లాంట్ యొక్క పూర్తి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సోలార్ ప్లాంట్‌లో ఏర్పాటుచేసిన (బి.ఈ.ఈ.ఎస్.) బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంను పరిశీలించారు. ఈ సందర్భంగా విధినిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, పని విధానాన్ని మెరుగుపరుచుకోవడం గురించి తగు సూచనలు సలహాలను సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.సీతారామం జనరల్ మేనేజర్ సోలార్, వై.విజయ శేఖరబాబు జి.ఎం ఎస్.ఓ.టు డైరెక్టర్ ఈ అండ్ ఎం, మందమర్రి ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎం బాలాజీ భగవతి జ, ఎస్.శ్రీనివాస్ ఏజీఎం ఎస్.టి.పి.పి, ఎం.కేశవరావు డీ.జీ.ఎం సోలార్ కార్పొరేట్, ఆర్.నరేష్ డి.వై ఎస్.ఇ ఈ అండ్ ఎం, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

## తెలంగాణ తల్లి విగ్రహానికి వినతి

**మంచిర్యాల, జనవరి 8, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో గల తెలంగాణ తల్లి విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం సంచార కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చి, నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలలో ఉన్న అనేక కులాలకు కార్పోరేషన్లు ఏర్పాటు చేయడం జరిగింది దాని స్వాగతిస్తూనే రాష్ట్రంలో అత్యంత వెనుక బడిన కులాలు అయిన డి.ఎన్.టి లకు కార్పోరేషన్ ఏర్పాటుపై ప్రభుత్వం ఆలోచన చేయకపోవడం బాధాకరం దేశానికి స్వతంత్రం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్న సంచార కులాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని, ఈ కులాలు విద్యా ఉద్యోగ ఆర్థిక రాజకీయ రంగాల్లో మచ్చుకైన అవకాశాలు వచ్చినా సందర్భం లేదు పొట్టకూటికోసం నానా అవస్థలతో సంచార జీవితాన్ని గడుపుతున్న కులాలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతను అందించి విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలతో పాటు వాళ్ళ ఆర్థిక అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి వాళ్ళ అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందించాలని కోరారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్ సంచార జాతుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వైద్య భాస్కర్ బీసీ నాయకులు, గజెల్లి వెంకటయ్య,శాఖపూరి భీమ్ భీంసేన్ షలిమెల అంజయ్య రామగిరి రాజన్న చారి ధర్మాజీ మల్లేష్ వేముల తదితరు పాల్గొన్నారు.

## తెలంగాణ జనసేన యువజన విభాగానికి అడ్ హాక్ కమిటీ నియామకం

**- అడ్‌హాక్ కమిటీలో మాయ రమేష్‌కు చోటు**

**- పార్టీ బలోపేతమే లక్ష్యం**

**- పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సంస్థాగత మార్పులు**

**మందమర్రి, జనవరి 8, ప్రభాతవార్త**



తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సంస్థాగత మార్పులు చేపట్టారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం కమిటీని రద్దు చేయడం జరిగింది. 30 రోజుల పాటు విధులు నిర్వహించే అడ్‌హాక్ కమిటీ రద్దు చేసిన కమిటీ స్థానంలో, 30 రోజుల పాటు విధులు నిర్వహించే విధంగా యువజన విభాగం అడ్‌హాక్ కమిటీని నియమించేందుకు పార్టీ నిర్ణయం తీసుకుంది. పార్టీ ఆవిర్భావం నుంచే క్రియాశీలకంగా పనిచేస్తున్న అనుభవజ్ఞులైన యువ నాయకులతో ఈ అడ్ హాక్ కమిటీని ఏర్పాటు చేసి, వారి పేర్ల జాబితాను అధికారికంగా ప్రకటిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నియోజకవర్గాల వారీగా బాధ్యతలుఈ అడ్ హాక్ కమిటీలోని సభ్యులను నిర్ణీత నియోజకవర్గాలకు బాధ్యులుగా నియమించనున్నారు. ఆయా నియోజకవర్గాల్లో యువజన విభాగాన్ని బలోపేతం చేయడం, పార్టీ మరియు సమాజ సేవకు ఆసక్తి ఉన్న యువతను పార్టీలోకి ఆహ్వానించడం, అలాగే వారిలోంచి ఉత్సాహవంతులు, క్రియాశీలకంగా పనిచేయగల యువ నాయకుల జాబితాను కేంద్ర పార్టీ కార్యాలయానికి అందించడం వంటి కీలక బాధ్యతలను వారు నిర్వర్తించనున్నారు. పూర్తిస్థాయి కమిటీలో అవకాశాలుత్వరలో ఏర్పాటు చేయనున్న పూర్తిస్థాయి తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం కమిటీలో, ఈ అడ్‌హాక్ కమిటీ సభ్యుల పనితీరు, కృషిని పరిగణలోకి తీసుకుని వారికి అవకాశం కల్పించే దిశగా పార్టీ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.